సాక్షి
పెద్దపల్లి
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023

నేడు పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, పారిశుధ్యం, వీధిదీపాల సమస్యలతో పాటు, పందులు, కుక్కలు, కోతుల బెడదకు సంబంధించిన సమస్యలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు 'సాక్షి' దినపత్రిక ఫోన్‌ఇన్ ద్వారా ప్రజలకు అవకాశం కల్పిస్తోంది. కమిషనర్ పరిష్కార మార్గాలను వివరిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.


తేదీ:	సమయం: ఉదయం 11	సెల్ నంబర్:
25.02.2023	నుంచి 12 గంటల వరకు	91009 02361

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
ఉక్కపోత పెరుగుతుంది.
గాలిలో తేమశాతం తక్కువ నమోదవుతుంది.

ఎమ్మెల్యేలూ..! రాజధానికి రావద్దమ్మా..!



- వారంలో ఆరురోజులు నియోజకవర్గాల్లోనే ఉండాలి
- ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలకు సీఎం ఆదేశాలు?
- ప్రజలకు అందుబాటులో ఉండాలని హితవు
- అకారణంగా రాజధానికి రావొద్దని స్పష్టీకరణ
- ముగ్గురు కేబినెట్ మంత్రులకు మినహాయింపు
- ఇప్పటికే పలు కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా.. తెలంగాణ ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీకి పట్టుకొమ్మగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర నినాదం ఎత్తుకున్నప్పటి నుంచి నేటి వరకు జిల్లాపై ప్రత్యేకమైన అభిమానం ప్రదర్శిస్తున్నారు. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 13 స్థానాలకు గాను, 12 చొప్పున అసెంబ్లీ స్థానాలు సాధించి బలాన్ని చాటుకుంది. ఇప్పుడు కూడా పూర్వపు తరహాలోనే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని పార్టీ స్పష్టమైన ఆదేశాలు పంపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మంత్రులు మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా వారంలో కనీసం ఆరురోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అత్యవసరమైతే తప్ప.. ఇకపై నుంచి చీటికి మాటికి రాజధానికి రావాల్సిన అవసరం లేద ని, నియోజకవర్గపు సమస్యలపై దృష్టి సారించాలని స్పష్టంచేసినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన దరిమిలా అందరు ఎమ్మెల్యేలకు సీఎం, పార్టీ అధిష్టానం నుంచి సందేశం అందినట్లు సమాచారం.

ఇప్పటికే మొదలు..

జిల్లాలో మంత్రి కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ పరంగా జిల్లాల్లో వరుస సమావేశాలతో బిజీగా ఉంటున్నారు. అటు కేబినెట్ ఇటు జిల్లా కలెక్టర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 13 సమావేశాల్లో హుజూరాబాద్, మంథని మినహా మిగిలిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు అధికార పార్టీ గెలిచింది. సీఎం ఆదేశాలతో దాదాపుగా ఎమ్మెల్యేలంతా స్పీడు పెంచారు.

జగిత్యాల: డా.సంజయ్‌కుమార్ పల్లె నిద్రపేరుతో గ్రామాల్లో నిద్రిస్తున్నారు.

కోరుట్ల: విద్యాసాగర్‌రావు లబ్ధిదారులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

ధర్మపురి: ఈశ్వర్ నిరంతరం జిల్లా సమీక్షలు, లబ్ధిదారులతో సమావేశాలు కొనసాగిస్తున్నారు.

సిరిసిల్ల: కేటీఆర్ వేములవాడ మాస్టర్‌ప్లాన్ జిల్లాపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

వేములవాడ: రమేశ్‌బాబు కొద్దికాలంగా నియోజకవర్గంలో తన పర్యటనలు పెంచారు.

కరీంనగర్: గంగుల కమలాకర్ తీగల వంతెన, ఎంఆర్‌ఎఫ్, స్మార్ట్‌సిటీ పనులపై సమీక్ష చేస్తున్నారు.

చొప్పదండి: కొండగట్టు మాస్టర్‌ప్లాన్‌తో రవిశంకర్ నియోజకవర్గంలో తన స్పీడును పెంచారు.

మానకొండూరు: బాలకిషన్ పల్లెల్లో మార్నింగ్ వాక్‌లకు ప్లాన్ చేస్తూ.. ఇంటింటా తిరుగుతున్నారు.

పెద్దపల్లి: మనోహర్‌రెడ్డి నిత్యం లబ్ధిదారులతో సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు.

రామగుండం: చందర్ నిరంతరం సేవా, వసతుల కల్పనపై సమీక్షలు చేస్తున్నారు.

హుస్నాబాద్: సతీశ్‌బాబు స్థానిక సమస్యలపై ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

అన్ని పార్టీలు వస్తున్న క్రమంలో..!

రాష్ట్రంలో పాత కరీంనగర్‌కు ఉన్న ప్రాధాన్యం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఇక్కడ పాగా వేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, బీఎస్పీ, వైఎస్సార్ టీపీ తదితర పార్టీలన్నీ కొంతకాలంగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి. తాజాగా వీటికి తోడుగా ఎంఐఎం కూడా చేరడం గమనార్హం. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేసిన పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ.. పెండింగ్ పనులను పూర్తి చేయాలని సీఎం నుంచి సీనియర్ లీడర్ల ద్వారా ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ప్రత్యర్థి పార్టీల సంఖ్య, రాజకీయ పోటీ పెరుగుతున్న దరిమిలా.. నిరంతరం ఎమ్మెల్యేలంతా అప్రమత్తంగా ఉండాల్సిందేనని హెచ్చరించినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలపై నిరంతర నిఘా..!

పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు సమాచారం. అందులో భాగంగా ఏ ఎమ్మెల్యే ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? స్థానికంగా ప్రజలకు ఎన్నిరోజులు అందుబాటులో ఉంటున్నారు? హైదరాబాద్‌లో ఎన్నిరోజులు ఉంటున్నారు? అన్న విషయాలపై నిరంతరం సమాచారం తెప్పించుకుంటున్నారు. వీటి ఆధారంగా వాటి పనితీరును ఆయన బేరీజు వేస్తున్నారని తెలిసింది. ఇటీవల సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్ కూడా ఉమ్మడి జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. గతవారం కొండగట్టు మాస్టర్ ప్లాన్ సందర్భంగా స్మితా సభర్వాల్ ఒకరోజు ముందే వచ్చారు. తాజాగా కరీంనగర్‌లో జరుగుతున్న తీగలవంతెన, ఎంఆర్‌ఎఫ్, స్మార్ట్‌సిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఆమె పరిశీలించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటలిజెన్స్, పార్టీ, ఇతర వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సీఎంవోకు రిపోర్టు అందుతూనే ఉంది. అందుకు అనుగుణంగా సీఎం నుంచి తగిన సూచనలు, సలహాలు వస్తూనే ఉన్నాయి.

రేపు గురుకుల విద్యార్థులకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష

రామగుండం: రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం 2023–24లో 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 26వ తేదీన ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామని జిల్లా సమన్వయాధికారి ఎం.మంజుల తెలిపారు. ఆరోతరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, ఇంటర్ ఫస్టియర్ వాళ్లకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులను ఎంపిక చేయండి

పెద్దపల్లిరూరల్: ఇండ్లులేని పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు అర్హతగలవారిని ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ చీఫ్‌సెక్రటరీ అరవింద్‌కుమార్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను పదిరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. పోడుభూముల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలపై పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. ఆమోదించిన లబ్ధిదారుల వివరాలను సరిచూసుకుని పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రణ చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు డ్రిప్‌వ్యవస్థ ఏర్పాటుకు సహకరించాలన్నారు. హరితహారం కింద వచ్చే సీజన్‌లో నాటేందుకు అవసరమైన మొక్కలను స్థానికంగా ఉన్న నర్సరీల నుంచి సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో జీఓ 76 కింద ఎంపికైన 1372మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సంగీత పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.13లక్షల రుసుమును వసూలు చేసి చలాన్ ద్వారా చెల్లిస్తామని వివరించారు. ఆర్డీఓ వెంకటమాధవరావు, రామగుండం కమిషనర్ సుమన్‌రావు, డీఎఫ్‌వో శివయ్య, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్, డీఏవో ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఏవో ప్రసాద్ ఉన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతరశాఖల అధికారులు

ఆయిల్‌పాం డైరీ ఆవిష్కరణ

జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం ఆయిల్‌పాం సాగు రైతు డైరీని కలెక్టర్ సంగీత చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీఏవో ఆదిరెడ్డి పాల్గొన్నారు.



వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రాభివృద్ధి

- మంథని అభివృద్ధికి పుట్టమధు కష్టపడుతుండు
- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

మంథని/కమాన్‌పూర్(మంథని): ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న ఆలోచనలతో నేడు దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం రాత్రి మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంథని అభివృద్ధి కోసం జెడ్పీ చైర్మన్ పుట్టమధు నిరంతరం కష్టపడుతున్నాడని అన్నారు. అనంతరం మంథని బొక్కలవాగుపై రూ.5కోట్లతో నిర్మించిన రెండోవంతెనను ప్రారంభించారు. అంతకుముందు కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు, వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లుతో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో మనఊరు– మనబడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఎంపీ వెంకటేశ్ నేత, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, కమాన్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీలు రాసకొండ లక్ష్మి, ఆరెల్లి దేవక్క, రామగిరి జెడ్పీటీసీ మాదరబోయిన శారద, సర్పంచ్ నీలం సరిత, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, బోనాల వెంకటస్వామి, డీఈవో మాధవి పాల్గొన్నారు.











క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ట్రినిటీ విద్యార్థి



విశ్వాస్‌ను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14లో 400మీటర్ల పందెంలో ప్రథమస్థానం పొందిన విశ్వాస్‌ను ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. హన్మకొండలోని జెఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలల్లోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ రత్నమాల, వైస్‌ప్రిన్సిపాల్ అపరాజిత, పిఈటీ అజయ్, తదితరులు అభినందించారు.

సుశీల నేత్రాలు సజీవం



నేత్రాలు సేకరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన బత్తుల సుశీల శుక్రవారం మరణించారు. క్లబ్ సభ్యుడైన సుశీల కుమారుడు బత్తుల రమేశ్ తన తల్లి నేత్రాలు మరోఇద్దరికి చూపును ప్రసాదించాలనే ఆలోచనతో నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చాడు. లయన్స్‌క్లబ్‌ఎలైట్ ద్వారా సేకరించిన సుశీలమ్మ నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపించినట్లు క్లబ్‌ప్రతినిధులు శ్రీనివాస్ తెలిపారు.

గోరక్షక్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన తంగెళ్లపల్లి రాజ్‌కుమార్‌ను నమోమిషన్ వందే గోమాతరం గోరక్షక్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్విరాజ్ ఆచారిసిపెల్లి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో గోమాత విశిష్టతను చాటి చెప్పి గోరక్షకు పాటుపడాలని సూచించారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

- ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా



బాబర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్: కార్మికుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఆయన నివాసంలో ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగ గర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి కొలిపాక మల్లయ్యలు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యంతో మాట్లాడి హక్కులను సాధిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక సుజాత, అడిషనల్ జనరల్ సెక్రటరీ కందుల స్వామితో పాటు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283 [H-793615]

WANTED

క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నిషియన్స్, రిసెప్షనిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ డా॥ ఓం డయాగ్నోస్టిక్స్, సివిల్ హాస్పిటల్ ప్రక్కన, కరీంనగర్. సెల్: 9246930093, 6301090216 [K-1232935]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781850]

www.sakshi.com

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- వాటర్ పైప్‌లైన్ల కోసం రూ.4కోట్ల నిధులు
- కుక్కలు, కోతులు, పందుల కట్టడికి చర్యలు
- క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రణాళికలు

సాక్షి ఫోన్ ఇన్

కోల్‌సిటీ: తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పలు సమస్యల పరిష్కారం కోసం 35 మంది ఫోన్‌చేయగా, వారందరికీ మున్సిపల్ కమిషనర్ సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమన్‌రావు మాట్లాడుతూ.. నగరంలో తాగునీరు సరఫరా కాని ప్రాంతాలకు వెంటనే పైప్‌లైన్ల నిర్మాణంతోపాటు లీకేజీల మరమ్మతులకు రూ.4 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. పారిశుధ్యం మెరుగుపర్చడానికి ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లకు జీపీఎస్ సిస్టమ్‌తో ట్రాకింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కుక్కలు, కోతులు, పందుల కట్టడికి ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

'సాక్షి' ఫోన్ ఇన్‌లో రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

ప్రశ్న: స్వైరవిహారం చేస్తున్న కుక్కలు, పందుల బెడద తీర్చండి.
– ఎండీ.రహీం, రేవెళ్లి పద్మ, పీక అరుణ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, సదానందం, సారయ్య

కమిషనర్: రామగుండం నగరపాలకపరిధిలో కుక్కలు, పందుల కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నాం. కరీంనగర్‌లో ఇలాంటి పనులు చేపట్టిన ఒక ఏజెన్సీతో చర్చలు జరుపుతున్నాం.

ప్రశ్న: దుర్గానగర్‌లోని ఆర్‌కే గార్డెన్ సమీపంలో తాగునీరు, యూజీడీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి.
– విజయ, సంపత్‌రెడ్డి, గుండేటి మల్లేశ్, 26వ డివిజన్

కమిషనర్: తాగునీటి సరఫరాకు రూ.4 కోట్ల నిధులు కేటాయించాం. డివిజన్ కార్పొరేటర్ ద్వారా సమీక్షించి అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

ప్రశ్న: 8వ కాలనీలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయండి. – లింగమూర్తి, రాంచందర్

కమిషనర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుగా క్రీడా ప్రాంగణాల అభివృద్ధిపై దృష్టిపెట్టాం. తర్వాత ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు ఆలోచిస్తాం.

ప్రశ్న: 14వ డివిజన్‌లో కోతులు బెడద తీర్చండి.
– చేకూరి సాయి, లక్ష్మీపురం

కమిషనర్: కోతులు, కుక్కలను పట్టే ఏజెన్సీతో చర్చిస్తున్నాం. త్వరలోనే చర్యలు చేపడుతాం.

ప్రశ్న: తాగునీరు, యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టండి. – దబ్బెట శంకర్, సప్తగిరి కాలనీ

కమిషనర్: సప్తగిరి కాలనీలో సమస్యలను గుర్తించడానికి ఇంజనీర్‌ను పంపిస్తాను. త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: తాగునీటి సరఫరా సన్నగా వస్తోంది
– మామిడి కుమారస్వామి, శాలపల్లి

కమిషనర్: సమస్య పరిష్కారం కోసం వెంటనే మీ ప్రాంతానికి ఏఈ స్థాయి అధికారిని పంపిస్తాం.

ప్రశ్న: ప్రతీ రోజు చెత్తను తరలించకుండా, తడి, పొడి చెత్తపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు..? – సంతోష్, 25వ డివిజన్

కమిషనర్: పారిశుధ్యం మెరుగుపర్చడానికి వాహనాలకు జీపీఎస్ సిస్టమ్‌తో ట్రాకింగ్ చేస్తున్నాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: దోమల నివారణకు చర్యలు తీసుకోండి.
– నడిపెల్లి కిషోర్, 5వ డివిజన్

కమిషనర్: దోమల నివారణకు డివిజన్‌లో ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: మార్కండేయకాలనీ ప్రధాన రహదారి ప్రక్కనున్న 15 కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేయండి... – గజ్జెల్లి వెంకటేశ్వరు

కమిషనర్: తాగునీరు సరఫరా కానీ ప్రాంతాల్లో పైప్‌లైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాం. సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రోడ్లపైన చెత్త పేరుకుపోతోంది.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు... – గాదె శంకర్, గోదావరిఖని గాంధీచౌక్

కమిషనర్: ఏప్రిల్ 1 నుంచి రోడ్లపై చెత్త వేసేవారికి జరిమానాలు విధిస్తాం.

ప్రశ్న: ఇందిరమ్మకాలనీ అస్తవ్యస్తంగా మారింది. పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దోమలు వ్యాపిస్తున్నాయి. డ్రెయినేజీలు అధ్వాన్నంగా ఉన్నాయి. – రాంచందర్, ఇందిరమ్మకాలనీ

కమిషనర్: పీకే రామయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. రోడ్లను శుభ్రం చేయించడంతోపాటు ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: అధికారుల నిర్లక్ష్యంతోనే పారిశుధ్యం గాడితప్పింది. గోదావరి వంతెనపై పెన్సింగ్ ఏర్పాటు చేయండి..
– మద్దెల దినేశ్

కమిషనర్: పారిశుధ్యం మెరుగుపర్చడానికి చర్యలు చేపడుతున్నాం. వంతెనపై పెన్సింగ్ ఏర్పాటుకు ఎస్టిమేషన్ చేస్తాం.

ప్రశ్న: సంజయ్‌నగర్‌లో వాటర్ లీకేజీ, యూజీడీ, సీసీ రోడ్డుకు సీఎంకు ఫిర్యాదు చేసిన. సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా అధికారుల్లో స్పందన లేదు..
– బొడ్డు రాజేశం, 11వ డివిజన్

కమిషనర్: ఇంజనీర్‌ను పంపించి సమస్యలను పరిశీలించమని ఆదేశిస్తాను. పరిష్కారంకు చర్యలు తీసుకుంటాం.



ఫోన్‌ఇన్‌లో సమాధానాలు ఇస్తున్న కమిషనర్

ప్రశ్న: శ్రీనగర్‌కాలనీలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ చేపట్టండి...
– విద్యాసాగర్, శ్రీనివాస్

కమిషనర్: ఎన్టీపీసీ సంస్థ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ స్థానికులే అడ్డుకుంటున్నారు. ఇది సరికాదు. కాలనీవాసులు ముందుకు వస్తే విస్తరణ జరుగుతుంది.

ప్రశ్న: విఠల్‌నగర్ సిక్ అస్పత్రి సమీపంలో సీనియర్ సిటిజన్ హాల్ నిరుపయోగంగా మారింది. చెత్త పేరుకుపోతోంది చర్యలు తీసుకోండి. – మహేందర్

కమిషనర్: సమస్యల పరిష్కారంకు అధికారులను ఆదేశించి, వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: శాంతినగర్‌లో యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. – రాములు

కమిషనర్: సమస్య పరిష్కారానికి అధికారులతో పర్యవేక్షించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: లక్ష్మీపురంలో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టండి – కీర్తి రమేశ్

కమిషనర్: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

గోమాస శ్రీనివాస్ జోలికొస్తే ఊరుకునేది లేదు

- నేతకాని మహర్, సమతా సైనిక దళ్ సంఘాల నాయకుల డిమాండ్



నేతకాని మహర్, సమతా సైనికదళ్ నాయకులు

జ్యోతినగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కో–ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గోమాస శ్రీనివాస్ జోలికి వస్తే ఊరుకునేది లేదని నేతకాని మహర్, సమతా సైనిక దళ్ సంఘాల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ వద్ద రాష్ట్ర నాయకులు దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో బండారి కనకయ్య, దుర్గం నర్సయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న, దూట రాజు మాట్లాడుతూ జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఘాల కో–ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గోమాస శ్రీనివాస్‌పై అదే పార్టీకి చెందిన ప్రేమ్‌సాగర్ రావు మనుషులు దాడి చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. గోమాసకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పదవి రావడానికి ఓర్చుకోలేక ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన అనుచరులు భౌతిక దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. అధిష్టానం ప్రేమ్ సాగర్‌రావును వెంటనే పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–2 ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగేళ్ల నుంచి ఇవ్వాల్సిన సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని కోరుతూ శుక్రవారం ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న, బి.అశోక్ వినతిపత్రం ఇచ్చారు. చిట్టీలు ఇవ్వకపోవడంతో వారి వేతనాల నుంచి రికవరీ అయిన సొమ్ము విషయం గందరగోళంగా మారిందన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి వెంటనే సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేయాలని కోరారు. రాజనర్సు, బుచ్చమ్మ, సమ్మయ్య, మల్లేశ్, ప్రేమ్ కుమార్, శంకర్, మల్లికార్జున్, పద్మ, మనోజ్, దుర్గేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ క్రికెట్ జట్టుకు సింగరేణి ఉద్యోగి



సంపత్‌ను సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఏపీఏ ఏరియాలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న వీర్ల సంపత్ ప్రభుత్వ రంగ(పబ్లిక్ సెక్టార్) క్రికెట్‌జట్టుకు ఎంపికైయ్యాడు. సంపత్‌ను శుక్రవారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ తరపున కోల్ ఇండియాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 18వ సారి పబ్లిక్ సెక్టార్‌కు సంపత్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 4వరకు రాంచీలో నిర్వహించనున్న ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొని మార్చి 13 నుంచి 18వరకు పబ్లిక్ సెక్టార్ టోర్నీలో పాల్గొంటాడని ఆయన తెలిపారు. ఏరియా రక్షణ అధికారి సీహెచ్ వెంకటరమణ, డీజీఎం చంద్రశేఖర్, ఎస్‌ఈ పర్చేస్ ఈ.నాగేశ్వర్ రావు, డీవైపీఎంలు ఎం.రవీందర్‌రెడ్డి, కే.మారుతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ఫ్లై ఓవర్ వంతెన నిర్మించాలి



ఆందోళన చేపడుతున్న ప్రజాపంథా నాయకులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ శివారులో గ్రాండ్ రూట్‌లో ఉన్న ప్రధాన రైల్వేగేటుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ శుక్రవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైల్వేగేటుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా పెరుగుతున్న రైళ్లసంఖ్యకు అనుగుణంగా నూతన రైల్వేట్రాక్ వేయడంలో ఉన్న శ్రద్ధ రైల్వేగేట్లను ఎత్తివేయడంలో రైల్వేశాఖ, స్థానిక ప్రజాప్రతినిధులకు లేదన్నారు. పెద్దంపేట గ్రామ ప్రజల అవసరాలు అన్నీ రైల్వేగేటు అవతలివైపు ఉండడం, సదరు రహదారి సుమారు 30 గ్రామాలకు కనెక్టివిటీ ఉండడంతో తరచూ రైల్వేగేటు వేసి ఉండడంతో రోగులు, మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రైల్వేశాఖ, స్థానిక పెద్దపల్లి ఎంపీ స్పందించి రైల్వే వంతెన నిర్మాణం చేపట్టేంతవరకు తమ ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, పెండ్యాల రమేశ్, ఆడెపు శంకర్, భూషణవేణి కృష్ణ, కోడిపుంజుల మహిపాల్, కల్పన, స్వప్న, భీమయ్య, తమ్మనవేణి పోచయ్య ఉన్నారు.

ఉపాధిహామీ పనులు తనిఖీ



కందకాలు పరిశీలిస్తున్న సీఆర్‌డీ బృందం

రామగిరి(మంథని): ముత్తారం మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం సీఆర్‌డీ(కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్)బృందం సభ్యులు తనిఖీ చేశారు. మండలంలోని లక్కారం, అడవిశ్రీరాంపూర్ గ్రామశివారుల్లోని అటవీప్రాంతంలో తవ్విన ఫారెస్ట్ కందకాల పనులు పరిశీలించారు. సీఆర్‌డీ రాష్ట్ర టెక్నికల్ అధికారి శ్రీదేవి, స్టేట్ ప్లాంటేషన్(హరితహారం)మేనేజర్ శాంతి, స్టేట్ క్వాలిటీ అధికారి ఉపేందర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో నెగ్గితేనే ఉద్యోగావకాశాలు

- అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగ యువత తమ ప్రతిభా నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉద్యోగావకాశాలు సాధించగలుగుతారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీలో శుక్రవారం టీఎస్‌కేసీ, మ్యాజిక్ బస్ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన వారిని ఉద్దేశించి అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ఆధునిక సాంకేతికపై సంపూర్ణ అవగాహన పెంచుకుని పేరొందిన కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. జాబ్‌మేళాకు దాదాపు 200మంది హాజరుకాగా 40 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందించారు. ప్రిన్సిపాల్ లక్ష్మినర్సయ్య, వైస్‌ప్రిన్సిపాల్ నితిన్, కెప్టెన్ సంజీవ్, శ్రీనివాస్, రామకృష్ణ, మనోజ్, అర్జున్, భానువిజయానంద్, టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ తిరుపతి, తదితరులు ఉన్నారు.

అంజన్నకే శఠగోపం

- కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం
- ముసుగులు ధరించి వచ్చిన ముగ్గురు ముష్కరులు
- ఆలయ ఏళ్లచరిత్రలో తొలిసారి చోరీ సంఘటన కలకలం
- ఆలయ అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



విచారణ జరుపుతున్న పోలీసు అధికారులు

కొండగట్టు(చొప్పదండి): ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన, ఏళ్లచరిత్రగల కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున చోరీ జరిదింది. చోరీ చిన్నదే అయినా.. ఆలయ చరిత్రలో తొలిసారి కావడం కలకలం రేపుతోంది. అధికార యంత్రాంగం దీనిని తీవ్రంగా పరిగణిస్తోంది. సీఎం కేసీఆర్ ఇటీవల ఆలయాన్ని సందర్శించి అభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. అయితే, కొద్దిరోజుల తేడాతోనే దొంగలు చోరీకి పాల్పడడం విస్మయం కలిగిస్తోంది.

దొంగతనం జరిగింది ఇలా..

శుక్రవారం వేకువజామున 1.10 గంటల ప్రాంతంలో ముసుగులు ధరించిన ముగ్గురు దొంగలు ఆలయంలోకి చొరబడ్డారు. 2.20గంటల వరకు తమ పనికానిచ్చేశారు. తొలుత ఆలయం వెనకాల ద్వారాల తాళాలు పగుల గొట్టారు. అనంతరం అంతరాలయంలోకి వెళ్లే దారికి అడ్డుగా ఉన్న తలుపుల పట్టీలు తొలగించి లోనికి ప్రవేశించారు. గర్భాలయంలోని స్వామివారి కిరీటం, మకర తోరణం, శ్రీరామ రక్షగొడుగులు, మకర తోరణ స్తంభం, రెండు శఠగోపాలు, కవచం, అంతారాలయ తోరణాలు, ,శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయలోని మరోరెండు శఠగోపాలు, మరికొన్ని వస్తువులను అపహరించారు. ఆలయంలోని హనుమాన్ విగ్రహంపై గల శంఖుచక్రం, బంగారు శ్రీరామ రక్ష తోకవారం, పదుకలు, ఉత్సవమూర్తి, అంతరాలయంలని తోరణం, శ్రీలక్ష్మీఅమ్మవారి ఆలయంలోని వెండి తోరణం, పాదుకలు, శ్రీ వెంకటేశ్వర ఆలయంలోని శ్రీరామ పట్టాభిషేకం వస్తువుల జోలికి వెళ్లలేదు. మొత్తంగా 15కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వీటి విలువ సుమారు రూ.9లక్షల విలువ ఉంటాయని ఈవో వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

ఆలయానికి పటిష్టమైన భద్రత లేదు. ఉన్న ఒక అధికారి కూడా రాత్రి సమయాల్లో అందుబాటులో ఉండడంలేదు. దీంతో సిబ్బంది తమకు ఇష్టమైనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భక్తులు నిత్యం గర్భాలయంలోకి రావడం, వారితోనే అధికారులు, అర్చకులు పనులు చేయించుకోవడం, అధికారులు, సిబ్బంది చేయాల్సిన విధులను సెక్యూరిటీ గార్డులు, ఇతర వ్యక్తులతో చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవో, ఆలయ సూపరింటెండెంట్ పర్యవేక్షణ లోపం ఇందుకు కారణమని అంటున్నారు. మొత్తంగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడం పెద్దలోపంగా కనిపిస్తోంది.

12మందితో సెక్యూరిటీ..

ఆలయంలో భద్రతా చర్యలు చేపట్టేందుకు 12 హోంగార్డులు ఉన్నారు. వీరు ఉదయం 6గంటల – 6 గంటల వరకు ఆరుగురి చొప్పున విధులు నిర్వర్తిస్తారు. రాత్రివేళలో నలుగురు హోంగార్డులు విధుల్లో ఉంటారు. రోజూ మాదిరిగానే రాత్రి వరకు ఓ హోంగార్డు విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత తన గదికి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో ముగ్గురు దొంగలు ఆలయంలోకి చొరబడినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయాన్నే ఆలయాన్ని శుభ్రపరచడానికి వెళ్లిన స్వీపర్లు.. గర్భాయంలో కోతులు ఉండటం, సామగ్రి చెల్లాచెదురుగా పడిఉండడాన్ని గమనించారు. వెంటనే ఆలయ ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆలయ ఈవో వెంకటేశ్‌కు సమాచారం అందించారు. ఆలయ ఈవో ఘటపై పోలీసులకు సమాచారం అందించారు.

రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్..

సమాచారం అందుకున్న పోలీసులు.. ఆలయానికి చేరుకున్నారు. భేతాళస్వామి ఆలయ పరిసరాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. నిత్యం స్వామివారికి వినియోగించే సాగర్ గెస్ట్‌హౌస్ సమీపంలో హనుమాన్ కవచానికి సంబంధించిన ఓ ఫ్రేమ్‌ను వారికి దొరికింది. ఫింగర్ ప్రింట్ ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం, సైబర్ టీం ఆలయ పరిసరాల్లో అణువణువూ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. భక్తుల కోరికలు తీర్చే అంజన్న ఆలయంలోనే దొంగతనం జరగడం బాధాకరమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి చేస్తామన్న సమయంలో ఇలా దొంగతనం జరగడం విషాదకరమన్నారు.

10 ప్రత్యేక బృందాలతో గాలింపు

డీఎస్పీ ప్రకాశ్ నేతృత్వంలో 10 ప్రత్యేక పోలీసు బృందాలు దొంగల కోసం గాలిస్తున్నాయి. ఇందులో నలుగురు సీఐలు, 15 మంది ఏఎస్సైలు ఉన్నారు.

1008 నామాలతో పూజ

ఆలయంలో దొంగతనం జరగడం చాలా బాధాకరం. ప్రాయశ్చిత్తం కోసం హోమం, మూడు దేవతలకు 11లీటర్ల పాలతో అభిషేకం, 1008 నామాలతో పూజలు నిర్వహించాం. ఆ తర్వాతనే భక్తులకు అనుమతించాం.
– జితేంద్రప్రసాద్, అర్చకుడు, కొండగట్టు ఆలయం

దొంగలు ఉత్తరభారతీయులా?

- సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమైన కదలికలు
- సెక్యూరిటీ గార్డులు, భక్తుల్లా డ్రెస్సింగ్
- చోరీ అనంతరం మహారాష్ట్ర వైపు ప్రయాణం?
- పోలీసుల వద్ద కీలక సమాచారం

జగిత్యాలక్రైం/కొండగట్టు(చొప్పదండి): విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ దోపిడీలో పాల్గొన్న దొంగలు ఉత్తరభారతీయులు లేదా పొరుగు రాష్ట్రంవారు అయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైన వీడియోల ఆధారంగా.. పోలీసులు ఈ మేరకు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆలయం వెనక భాగాన ఉన్న భేతాళుడి గుడి నుంచి దొంగలు తలుపులు బద్దలు కొట్టినట్లు గుర్తించారు. చూసేవారికి అనుమానం రాకుండా సెక్యూరిటీ గార్డులను తలపించేలా డ్రెస్సింగు వేసుకుని, చేతిలో లాఠీలు పట్టుకున్నారు. సీసీ కెమెరాల్లో ముఖాలు కనబడకుండా తలలకు మంకీ క్యాపులు ధరించి, ఒంటిని పసుపురంగు శాలువాలతో కప్పుకున్నారు. తలుపులు బద్దలు కొట్టేందుకు వీలుగా ఉండే రెంచ్‌లు, ఇతర పనిముట్లను శాలువాల చాటును లోనికి తీసుకువచ్చారు. వీరి కదలికలు ఆహార్యం, ఆకారాలను బట్టి వీరు ఉత్తరభారతీయులుగా అనుమానిస్తున్నారు. వారం రోజులుగా జిల్లాలో వరుసగా జరుగుతున్న ఆలయాల చోరీలకు, వీటికి ఏదైనా లింకుందా లేదా? అన్న విషయాలను సైతం పోల్చిచూస్తున్నారు. రాత్రిపూట వెండి తాపడాలను పనిముట్లతో తొలచుకుపోయినా ఎలాంటి చడీచప్పుడు రాకుండా జాగ్రత్తపడ్డారంటే వీరంతా పక్కా ప్రొఫెషనల్ గ్యాంగ్ అన్న నిర్ధరణకు వచ్చారు. వీరికి సంబంధించిన కీలక సమాచారం కూడా పోలీసుల వద్ద ఉన్నట్లు సమాచారం. వీరు మహారాష్ట్రవైపు పారిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

పోలీసులపై చర్యలు..!

ఈ క్రమంలో ఆలయానికి రాత్రిపూట భద్రత కల్పించిన పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ మేరకు విధుల్లో అలసత్వం వహించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

దొంగలను గుర్తించిన పోలీసులు?

ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ దొంగలను పోలీసులు ఎట్టకేలకు గుర్తించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. సీసీఫుటేజీల్లో రికార్డుల ప్రకారం దొంగలను పోలీసులు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టగా వారి ఉన్న ఆచూకి కూడా కనుగొన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వీరి అరెస్టును పోలీసులు ధ్రువీకరిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి.